క్లుప్తంగా

ఆర్చరీలో వైభవ్ రెడ్డి ప్రతిభ


బంగారు పతకం సాధించిన వైభవ్ రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: మహారాష్ట్ర పూణే పంచంగిలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకూ జరిగిన సీబీఎస్ఈ నేషనల్ ఆర్చరీ టోర్నమెంట్‌లో బొమ్మూరుకు చెందిన తమనంపూడి సాయికిరణ్ రెడ్డి, స్వాతి దంపతుల కుమారుడు వైభవ్ రెడ్డి అండర్ -9లో బంగారు పతకం సాధించాడు. లారెల్ హైస్కూల్లో మూడో తరగతి చదువుతున్న వైభవ్.. గోదావరి ఆర్చరీ అకాడమీలో నాళం రామ్‌కుమార్, వైభవ్ సాహు వద్ద శిక్షణ పొందుతున్నాడు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

సీటీఆర్ఐ: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే శ్రీవారిని భక్తులు దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శనానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. దేవీచౌక్‌లోని మఠం వీధి వేంకటేశ్వరస్వామి ఆలయం, లాలాచెరువు గోవింద క్షేత్రం, ఆర్యాపురంలోని సత్యనారాయణ దేవాలయంతో పాటు అనేక వైష్ణవాలాయాల్లో వైకుంఠ ఏకాదశిని వైభవంగా నిర్వహించనున్నారు.

ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సత్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: జవహర్ వాకర్స్ క్లబ్ నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక వెంకటేశ్వరనగర్ పార్కులో జరిగిన సర్వజన సభలో అధ్యక్షుడిగా అక్కెన సత్యనారాయణ, క్లబ్ సెక్రటరీగా జి.సూర్యనారాయణమూర్తి, కోశాధికారిగా పాలూరి నాగేశ్వరరావు తదితరులు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో వాకర్ జిల్లా గవర్నర్ మాచవరపు భాస్కరరావు, రీజినల్ కౌన్సిలర్ ఎస్.తాతారావు పాల్గొన్నారు.

అయ్యప్పల ఆందోళన

సీటీఆర్ఐ: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసి పోస్టింగులు పెట్టిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ అయ్యప్ప స్వాములు నిరసన తెలిపారు. గౌతమఘాట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఆదివారం ఈ ఆందోళన జరిగింది. హిందూ ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ వెంటనే క్షమాపణ చెప్పాలని ధర్మశాస్త్ర ఆధ్యాత్మిక కేంద్రం అయ్యప్ప భక్తులు డిమాండ్ చేశారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు

ధవళేశ్వరం: ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన ఉదయమే ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి జైకుమార్, పాలిక రాజబాబు, కేఎస్ గౌరీ శంకర్, పీఎస్ శేషుకుమార్, ఎస్.సత్తిరాజు, సయ్యద్ బాజీ, సతీష్ కుమార్, వాసుదేవి, ఏవీవీ రామారావు పాల్గొన్నారు.

15న ముగ్గుల పోటీలు

ప్రకాశం నగర్: జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం అనుబంధ సంస్థ చౌడేశ్వరి దేవాంగ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన జాంపేట కోఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు అల్లాడ శ్యామల దేవి తెలిపారు. స్థానిక ఉమారామలింగేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు సంఘం అధ్యక్షుడు రొబ్బి విజయ శేఖర్, ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణమూర్తి తదితరులు సహకారం అందిస్తున్నారన్నారు. ముగ్గుల పోటీ కన్వీనర్ ముప్పాన శ్రీనివాస్, చింతా చలపతి పాల్గొన్నారు.

వంద మందికి చీరల పంపిణీ

ప్రకాశం నగర్: ఏసుక్రీస్తు సంఘ కాపరి రెవరెండ్ పీఎం రాజు ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బర్రే కొండబాబు, అడ్వకేట్ భావన రంగారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం రాజు సువార్త సందేశం అందించారు. సుమారు వంద మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం మాజీ చైర్మన్ దాసి వెంకటరావు, గుమ్మడి సమర్పణ రావు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో ఆర్థిక ఆసరా

- లబ్ధిదారుల హర్షం
- అర్బన్ పరిధిలో 1,453 మంది పింఛన్‌దారులు

సీటీఆర్ఐ: పింఛన్ సొమ్ము పెంపుతో లబ్ధిదారులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తగా మంజూరైన వారు సంతోష పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్ము పెంపుదల చేశారు. గత టీడీపీ హయాంలో పింఛన్ పొందాలంటే ఎన్నో అగచాట్లు పడేవారు. అది కూడా అరకొరగా ఇచ్చేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టక పింఛన్‌దారుల కష్టాలు తీరిపోయాయి. గ్రామ/వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకుంటే చాలు, అర్హత ఉన్నవారికి నేరుగా ఇంటికే తీసుకువచ్చి అందిస్తున్నారు. ఈనెల 3వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ నెల 7వ తేదీ వరకూ పింఛన్ వారోత్సవాలు జరుగుతాయి.

అర్బన్ పరిధిలో..

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 29,698 మంది లబ్ధిదారులున్నారు. వీరికోసం ప్రభుత్వం రూ.7,40,24.500 విడుదల చేస్తోంది. పాతవారితో పాటు మరో 1453 మంది అర్హత ఉన్న వారికి అదనంగా పింఛన్‌ను మంజూరు చేసింది. దీనితో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సదరన్ సర్టిఫికెట్ సవరణతో..

42వ డివిజన్‌లోని సుభాష్ నగర్ 79వ వార్డు సచివాలయ పరిధిలోని వికలాంగ చిన్నారి మోర్త భానుప్రకాష్‌కి సదరన్ సర్టిఫికెట్ లేకపోవడంతో వికలాంగ పింఛన్ రాలేదు. దీనితో వార్డు సచివాలయం సిబ్బంది సదరన్ సర్టిఫికెట్ ఏర్పాటు చేసి పింఛన్‌కి దరఖాస్తు చేశారు. వెంటనే పింఛన్ మంజూరైంది. దీంతో తల్లి పార్వతి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే సదరన్ సర్టిఫికెట్ లేకపోవడంతో మండపల్లి సత్యమాధవికి పింఛన్ మంజూరు కాలేదు. దీనితో సచివాలయం సహాయంతో సదరన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆమె కూడా వికలాంగ పింఛన్ మంజూరు కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక అండ



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్ము పెంచడంతో మాకు ఆసరా పెరిగింది. ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా సీఎం జగన్ పింఛన్ సొమ్ములు అందజేస్తున్నారు. మాలాంటి వారికి ఎంతో అండగా ఉంటున్నారు.

– అదుసుమిల్లి జయమ్మ, సుభాష్ నగర్, రాజమహేంద్రవరం

వృద్ధులకు వరం



జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్‌ను పెంచుతూ రూ.3 వేలు చేస్తానని ప్రకటించారు. ఆ విధంగానే ఈ ఏడాది రూ.250 పెంచడం ఆనందంగా ఉంది. పింఛన్‌తో ఏ విధమైన ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– బొక్కా సీతమ్మ, మున్సిపల్ కాలనీ, రాజమహేంద్రవరం

55 ఏళ్ల తర్వాత స్నేహితుల కలయిక


కార్యక్రమానికి తరలివచ్చిన బాల్య మిత్రులు

రాజమహేంద్రవరం సిటీ: వీరందరూ బాల్య స్నేహితులు. స్వచ్ఛమైన స్నేహానికి ప్రతిరూపాలు. రాజమహేంద్రరం ఆల్కాట్ తోట ఏఎంహెచ్ స్కూల్లో 1968లో చిట్టచివరి ఎస్ఎల్ఎస్‌సీ చదివారు. అనంతరం పైచదువులు చదివి వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరం ఆనందంగా గడపాలని నిర్ణయించుకున్నారు. సుమారు 55 ఏళ్ల తరువాత ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వీరంతా ఒకే చోట కలిసి చిన్ననాటి సంగతులు ముచ్చటించుకున్నారు. వీరి కలయికకు తెలంగాణలోని కొండాపూర్‌లో స్థిరపడిన విశ్రాంత గ్రేహౌండ్స్ ఎస్పీ బైరెడ్డి దుర్గా అప్పలరెడ్డి కృషి చేశారు. ధర్మాల సుబ్రహ్మణ్యం, పి.ముద్దు కృష్ణ, వి.వరదరాజు, పాల సత్యనారాయణ, దల్లి రాజశేఖరెడ్డి, భాస్కర మూర్తి, బొదిరెడ్ల అప్పారావు రెడ్డి, వెంకటేషన్ తదితరులు తరలివచ్చారు.

నేడు స్పందన రద్దు

రాజమహేంద్రవరం సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతివారం జరిగే స్పందన కార్యక్రమాన్ని ఈ సోమవారం రద్దు చేసినట్టు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. డయల్ యువర్ కమిషనర్, ఈ–స్పందన కూడా రద్దయ్యాయని తెలిపారు.

ఆశల వెలుగుకు ఆత్మీయ స్వాగతం

- ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు
- ప్రజల సంబరాలు

రాజమహేంద్రవరం రూరల్: నూతన సంవత్సరం ప్రజలందరి ఆకాంక్షలను నెరవేర్చాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, భరత్ అభిమానులు, వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు, అధికారులు తరలివచ్చి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర తెలికుల, గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీ ప్రియ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం వేంకటేశ్వరస్వామిని ఎంపీ భరత్‌రామ్ దర్శించుకున్నారు. ఏవీ అప్పారావు రోడ్డులోని శ్రీవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

కడియం మండలంలో..

కడియం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో సందడి నెలకొంది. పలు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులను ఆయా పార్టీల కార్యకర్తలు, కిందిస్థాయి సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గిరజాల వీర్రాజు, రావిపాటి రామచంద్రరావు తదితరులను ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలం నుంచి పలువురు నాయకులు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి, పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజుకు బ్యాంకు 16 బ్రాంచీల సిబ్బంది ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కడియంలో వీరి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.


ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దివ్యాంగుడు


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసులు



డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

సుఖ సంతోషాలతో ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రకాశం నగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో నూతన సంవత్సర వేడుకలు మిన్నంటాయి. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా దంపతులు సర్వదేవతా హోమం నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు దీవెనలు అందించాలని కోరారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పోలీస్ అధికారులు తరలివచ్చి జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టర్ మాధవీలతకు జక్కంపూడి రాజా శుభాకాంక్షలు తెలిపారు.

రుడా చైర్ పర్సన్ నివాసంలో..

టీటీడీ కల్యాణ మండపం రోడ్డులోని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

శివరామ సుబ్రహ్మణ్యం కార్యాలయంలో..

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.

రైల్వే స్టేషన్‌లో..

రైల్వే స్టేషన్ టికెట్ చెకింగ్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ కేశవభట్ల శ్రీనివాసరావు కేక్ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

డీసీసీబీ క్యాంపు కార్యాలయంలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్యామల సెంటర్ డీసీసీబీ ఆవరణలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజును డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు, జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, డీఎం త్రినాథ్, జీఎం ప్రకాష్, ఏజీఎం శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్లు, మేనేజర్లు, సూపర్ వైజర్లు, స్టాఫ్, సొసైటీ అధ్యక్షులు, సీఈవోలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. చందన గార్డెన్స్‌లోని రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్‌లకు నియోజకవర్గ పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు అధికసంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శులు గిరిజాల వీర్రాజు (బాబు), మింది నాగేంద్ర, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆరీఫ్ ఉన్నారు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను చందన నాగేశ్వర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


రుడా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి


చందన నాగేశ్వర్, చందన రమేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న గిరజాల బాబు


శివరామ సుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న పేపరుమిల్లు కార్మిక నాయకులు


రైల్వేస్టేషన్‌లో సీటీఐ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు


చైర్‌పర్సన్ గిరజాల దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యాపురం బ్యాంకు సిబ్బంది

ఉద్యమరీతిలో సేవా కార్యక్రమాలు


ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భగవాన్ సత్యసాయిబాబా సమాజ సేవా కార్యక్రమాలు ఉద్యమరీతిలో చేపట్టాలని సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. ఆల్కాట్ గార్డెన్ సత్యసాయి మందిరంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ భక్తులనుద్దేశించి మాట్లాడారు. విద్య, వైద్య, ఆరోగ్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహించాలని, తెల్లవారుజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, లిఖిత నామం రాయడం, సాయి గాయత్రి మంత్ర పఠనం, సామూహిక దీక్ష ప్రార్థనలు చేసి, సంస్థ సభ్యులంతా కార్యోన్ముఖులయ్యారన్నారు. ఈ సందర్భంగా ఆల్కాట్ గార్డెన్ మందిరంలో నిడదవోలు సూరిబాబు సత్యసాయి సంగీత విభావరి అలరించింది. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, మందిరం ప్రెసిడెంట్ దండమూడి గిరిధర్, కార్యదర్శి గంటా హనుమంతరావు, సబ్ జోన్ కన్వీనర్ కుసు సుబ్రహ్మణ్యం, సమితి కన్వీనర్లు, భజన మండలి కన్వీనర్లు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని గ్రామాల్లో సత్యసాయి సేవాసమితి సభ్యులు, కన్వీనర్లు, దీక్షా ప్రార్థన చేసి, నూతన సంవత్సర కేకును కోసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

నేటి నుంచి సీఐటీయూ మహాసభలు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధవళేశ్వరం: సీఐటీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. భీమవరంలో సోమవారం నుంచి ఈనెల 4వ వరకూ జరిగే సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన రాష్ట్రజాతా ఆదివారం ధవళేశ్వరం చేరుకుంది. తొలుత కాటన్ విగ్రహానికి జి.బేబీరాణి, రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధవళేశ్వరం బస్టాండ్ సెంటర్ వద్ద జరిగిన సభలో బేబీరాణి మాట్లాడుతూ మహాసభల్లో కార్మికులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, కర్రి రామకృష్ణ, అమ్మునాయుడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య జగన్నాథరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన 'నాక్' గుర్తింపును 2022లో సాధించామని, అదేవిధంగా 2023 కూడా అత్యుత్తమ ఫలితాలు, ప్రగతిని సాధిస్తూ, దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా 'నన్నయ' అభివృద్ధిని సాధించాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లకు చెందిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

కడియం: స్థానిక కెనాల్ రోడ్డుపై పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ఆటో, ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరం వైపు నుంచి కడియం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, కడియం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఆటో పోలీస్‌స్టేషన్ సమీపానికి వచ్చేసరికి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ముఖం, కాళ్ల తదితర శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. కాగా ఆటోలో మరో ఇద్దరు ఉన్నారని, ప్రమాదం జరిగిన వెంటనే వారు దిగి వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. గాయాలపాలైన ఆటో డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం నేపథ్యంలో బస్సులోని ప్రయాణికులను వేరేబస్సులో పంపించి వేసినట్లు స్థానికులు చెప్పారు. కాగా దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదని కడియం పోలీసులు అన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి


మాట్లాడుతున్న ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్

రాజానగరం: అటవీశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, అప్రమత్తంగా ఉంటూ నిజాయితీగా వ్యవహరించాలని దివాన్ చెరువులోని ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ అన్నారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా అకాడమీలో శిక్షణ పొందుతున్న ఫారెస్టు బీట్, ఫారెస్టు సెక్షన్ అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. రానున్న మూడేళ్లలో అకాడమీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి అనూష, ఎఫ్ఎస్ఓ పద్మజ, సూపరింటెండెంట్ జె.దామోదర్, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీ పీఠంలో నృత్య నీరాజనం


ఆకట్టుకున్న ప్రదర్శన

ప్రకాశం నగరం: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం స్థానిక జ్ఞాన సరస్వతి పీఠంలో ధవళేశ్వరం రాధాకృష్ణ కళాక్షేత్రం గోరుగొంతు బద్రీనారాయణ శిష్యబృందంతో అమ్మవారికి నృత్యనీరాజనం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు మాట్లాడుతూ గౌతమీ గోదావరి కల్చరల్ ట్రస్ట్ ద్వారా శాస్త్రీయ సంగీత, నృత్య గురువుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి, మూడో ఆదివారాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

సీతానగరం: రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో సీతానగరం కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ బి.వినీల, డాక్టర్ సత్యం రమేష్‌బాబు వైద్యసేవలు అందించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సుమారు 107 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రతినిధి సుశీల, క్రొవ్విడి భాస్కర ప్రసాద్, క్రొవ్విడి నరసింహరావు, యన్నమని వెంకట నారాయణ, సంగిశెట్టి వెంకటలక్ష్మి, మద్దుల ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కంబాలచెరువు: స్థానిక వై.జంక్షన్‌లో ఆదివారం రాత్రి రెండు వర్గాలకు ఘర్షణ జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లాకు చెందిన రాజేష్ అనే వ్యక్తి రాజమహేంద్రవరంలోని వై.శ్రీను పుట్టినరోజు వేడుకలకు వచ్చాడు. ఇటీవల కాలంలో రాజేష్ కొందరు ప్రజాప్రతినిధులపై దుర్భాషలాడాడనే కోణంలో ఆ వర్గం వారు రాజేష్ కారును అడ్డగించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు ఘర్షణ జరిగింది. విషయం తెలిసిన మూడో పట్టణ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. రాజేష్‌ను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘర్షణలో ఒక వాహనం స్వల్పంగా ధ్వంసమైనట్టు తెలుస్తోంది.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ప్రారంభం

రంగంపేట: రంగంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) స్టేషన్‌ను ఆదివారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ తయారీ, రవాణాను అడ్డుకోవడం, ఇసుక అక్రమాలను నిరోధించడం దీని యొక్క ప్రధాన విధులన్నారు. సెబ్ సీఐ సి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ అనపర్తి నియోజక పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు సంబంధించి ఎస్ఈబీ స్టేషన్ ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాయవరం సీఐ వేణు మాధవ్, ఎస్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.